సాక్షి
నిజామాబాద్
మంగళవారం । 30 । సెప్టెంబర్ । 2025

రఘునాథ చెరువులో బతుకమ్మను నిమజ్జనం చేస్తున్న యువతి..



బోర్గాంలో బతుకమ్మలతో మహిళలు, యువతులు





బోర్గాంలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు

సద్దుల సంబురం

• జిల్లా కేంద్రంతోపాటు పలు ప్రాంతాల్లో ఘనంగా బతుకమ్మ

జిల్లా కేంద్రమైన నిజామాబాద్ నగరంతోపాటు పలు ప్రాంతాల్లో సద్దుల బతుకమ్మను సోమవారం ఘనంగా నిర్వహించారు. గునుక, తంగేడు, బంతి, చామంతి ఇలా తీరొక్క పూలతో బతుకమ్మలను అందంగా పేర్చిన అతివలు ఆడిపాడి సందడి చేశారు. ప్రధాన కూడళ్లు పూలవనాలను తలపించాయి. నిజామాబాద్ నగరంలోని రఘునాథ చెరువు, కంఠేశ్వర్ ఆలయం, హమాల్‌వాడి సాయిబాబా ఆలయం, పులాంగ్, న్యూ హౌసింగ్ బోర్డ్ కాలనీ, ఎల్లమ్మగుట్ట, బాలహనుమాన్ ఆలయం తదితర ప్రాంతాల్లో బతుకమ్మ వేడుకలు వైభవంగా సాగాయి. – నిజామాబాద్ రూరల్

న్యూస్‌రీల్

వైన్ షాపులకు రెండు దరఖాస్తులు



ఖలీల్‌వాడి: లక్కీ డ్రా మద్యం దుకాణాలను కేటాయించేందుకు దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ ప్రారంభమైన విషయం తెలిసిందే. ఈనెల 26వ తేదీ నుంచి దరఖాస్తుల స్వీకరణ ప్రారంభమైనప్పటికీ శుక్ర, శనివారాల్లో ఒక్క దరఖాస్తు కూడా అందలేదు. సోమవారం నందిపేట్ వైన్‌షాపునకు కొరిపల్లి రజిత, సిరికొండ మండలంలోని మైలారం గ్రామంలోని మద్యం దుకాణానికి నందిపేట మండలంలోని ఆంధ్రానగర్‌కు చెందిన జి శ్రీనివాస్‌రావు దరఖాస్తు చేసినట్లు ఎక్సైజ్ సూపరింటెండెంట్ మల్లారెడ్డి తెలిపారు. దరఖాస్తుల స్వీకరణలో ఎక్సైజ్ ఎస్‌హెచ్‌వో స్వప్న, సిబ్బంది పాల్గొన్నారు.

ఎనిమిదేళ్ల తరువాత జూనియర్ కళాశాలలకు నిధులు

నిజామాబాద్‌అర్బన్: జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలకు ప్రభుత్వం ఇటీవల రూ.3.30 కోట్ల నిధులు మంజూరు చేసింది. జిల్లాలో 14 ప్రభుత్వ జూనియర్ కళాశాలలు ఉండగా, ఎనిమిదేళ్ల తరువాత ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. ఈ నిధులతో అమ్మ ఆదర్శ కమిటీల ఆధ్వర్యంలో కళాశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నారు. ముఖ్యంగా నీటివసతి, మరమ్మతులు, నీటి పైపుల ఏర్పాటు, టాయిలెట్ల మరమ్మతులు, డ్యూయల్ డెస్క్ వంటి పనులు చేపడుతున్నారు. విద్యార్థుల సంఖ్యను బట్టి ఎక్కువ సమస్యలు ఉన్న కళాశాలలకు అవసరాన్ని బట్టి నిధులు మంజూరు ఆయా కళాశాలలో అవసరాలను బట్టి నిధులను మంజూరు చేస్తున్నారు. ఇప్పటికే కొన్ని కళాశాలల్లో పనులు కొనసాగుతున్నాయి. ముఖ్యంగా కోటగల్లీ, అయిలాపూర్, ఖిల్లా ప్రభుత్వ జూనియర్ కళాశాలలకు నిధులు మంజూరు కాగా పనులు కూడా ప్రారంభమయ్యాయి. ఎక్కడెక్కడ అవసరమో అక్కడ నిధులను వినియోగిస్తున్నామని జిల్లా ఇంటర్ అధికారి రవికుమార్ అన్నారు.

ఎస్సారెస్పీలోకి పెరిగి.. తగ్గిన వరద



బాల్కొండ: ఎగువ నుంచి శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌లోకి సోమవారం ఇన్‌ఫ్లో పెరిగింది. ఆదివారం రోజు 3.15 లక్షల క్యూసెక్కుల నీరు రాగా, అర్ధరాత్రి తరువాత 4.5 లక్షల క్యూసెక్కులకు పెరిగింది. తరువాత క్రమంగా తగ్గుతూ.. సోమవారం రాత్రి వరకు 3.5 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతోంది. 39 వరద గేట్ల ద్వారా 3.25 లక్షల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ఆదివారం 4.5లక్షల క్యూసెక్కుల నీటిని విడుదల చేయగా సోమవారం తగ్గించారు. కాలువల ద్వారా నీటి విడుదల కొనసాగుతోంది. ప్రస్తుతం 1083.30 (54.7టీఎంసీలు) అడుగుల నీరు నిల్వ ఉంది.

మోగిన నగారా



• జిల్లాలో రెండు విడతల్లో స్థానిక ఎన్నికలు
• అమలులోకి వచ్చిన ఎన్నికల కోడ్
• అక్టోబర్ 9న ఎన్నికల క్రతువు ప్రారంభం .. నవంబర్ 11న పరిషత్ ఓట్ల లెక్కింపుతో ముగింపు
• అక్టోబర్ 23న 18 మండలాల్లో, 27న 13 మండలాల్లో పరిషత్ పోలింగ్
• అక్టోబర్ 31న 15 మండలాల్లోని 281 పంచాయతీలకు, నవంబర్ 4న 16 మండలాల్లోని 264 జీపీలకు..
• పోలింగ్ రోజే పంచాయతీ కౌంటింగ్

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: పరిషత్, పంచాయతీ ఎన్నికల నిర్వహణ కోసం రాష్ట్ర ఎన్నికల కమిషన్ నగారా మోగించింది. దీంతో ఎన్నికల నియమావళి అమలులోకి వచ్చింది. ఇందుకు సంబంధించి సోమవారం రాష్ట్ర వ్యాప్తంగా పరిషత్‌కు రెండు విడతల్లో, పంచాయతీలకు మూడు విడతల్లో ఎన్నికల ప్రక్రియ నిర్వహించేందుకు షెడ్యూల్ ప్రకటించింది. అయితే జిల్లాలో మాత్రం పంచాయతీ ఎన్నికలు సైతం రెండు విడతల్లోనే పూర్తి చేసేందుకు యంత్రాంగం రంగం సిద్ధం చేసింది.

ఎంపీటీసీ, జెడ్పీటీసీ మొదటి విడత..

మొదటి విడత ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలకు సంబంధించి అక్టోబర్ 9న నోటిఫికేషన్ ఇవ్వనున్నారు. 9వ తేదీ నుంచి 11వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు నామినేషన్లు స్వీకరిస్తారు. 12న నామినేషన్ల పరిశీలన ఉంటుంది. 13న అప్పీలు చేసుకోవచ్చు. 14న అప్పీళ్ల పరిష్కారం ఉంటుంది. 15న ఉపసంహరణ చేసుకోవచ్చు. ఇదే రోజు అభ్యర్థుల తుది జాబితా ప్రకటిస్తారు. 23వ తేదీ ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ నిర్వహిస్తారు. నవంబర్ 11న ఓట్ల లెక్కింపు ఉంటుంది.

ఎంపీటీసీ, జెడ్పీటీసీ రెండో విడత

రెండో విడత ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలకు సంబంధించి అక్టోబర్ 13న నోటిఫికేషన్ ఇవ్వనున్నారు. 13వ తేదీ నుంచి 15వ తేదీ వరకు నామినేషన్లు స్వీకరిస్తారు. 16న పరిశీలన ఉంటుంది. 17న అప్పీళ్లు చేసుకోవచ్చు. 18న అప్పీళ్ల పరిష్కారం ఉంటుంది. 19న ఉపసంహరణ చేసుకోవచ్చు. ఇదేరోజు అభ్యర్థుల తుది జాబితా ప్రకటిస్తారు. 27న ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ ఉంటుంది. నవంబర్ 11న ఓట్ల లెక్కింపు చేయనున్నారు.

పంచాయతీ మొదటి విడత ..

మొదటి విడత పంచాయతీ ఎన్నికలకు సంబంధించి అక్టోబర్ 17న నోటిఫికేషన్ ఇవ్వనున్నారు. 17వ తేదీ నుంచి 19వ తేదీ వరకు నామినేషన్లు స్వీకరిస్తారు. 20న పరిశీలన ఉంటుంది. 21న అప్పీళ్లు చేసుకోవచ్చు. 22న అప్పీళ్ల పరిష్కారం ఉంటుంది. 23న ఉపసంహరణ చేసుకోవచ్చు. ఇదేరోజు అభ్యర్థుల తుది జాబితా ప్రకటిస్తారు. 31న ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పోలింగ్ ఉంటుంది. అదే రోజు లెక్కింపు ఉంటుంది.

పంచాయతీ రెండో విడత..

రెండో విడత పంచాయతీ ఎన్నికలకు సంబంధించి అక్టోబర్ 21న నోటిఫికేషన్ ఇవ్వనున్నారు. 21వ తేదీ నుంచి 23వ తేదీ వరకు నామినేషన్లు స్వీకరిస్తారు. 24న పరిశీలన ఉంటుంది. 25న అప్పీళ్లు చేసుకోవచ్చు. 26న అప్పీళ్ల పరిష్కారం ఉంటుంది. 27న ఉపసంహరణ చేసుకోవచ్చు. ఇదేరోజు అభ్యర్థుల తుది జాబితా ప్రకటిస్తారు. నవంబర్ 4న ఉదయం 7గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పోలింగ్ ఉంటుంది. అదే రోజు లెక్కింపు ఉంటుంది.

❖ జిల్లాలోని 31 మండలాల్లో కలిపి మొత్తం 8,51,417 ఓట్లు ఉన్నాయి. 31 జెడ్పీటీసీ స్థానాలు, 307 ఎంపీటీసీ స్థానాలు, 545 గ్రామ పంచాయతీలు, 5,022 పంచాయతీ వార్డులు ఉన్నాయి.

❖ పరిషత్ ఎన్నికలకు సంబంధించి మొదటి విడతలో బోధన్, నిజామాబాద్ రెవెన్యూ డివిజన్ల పరిధిలోని 18 మండలాల్లోని 18 జెడ్పీటీసీలు, 177 ఎంపీటీసీ స్థానాలకు ఎన్నికలు జరుగనున్నాయి. రెండో విడతలో ఆర్మూర్ రెవెన్యూ డివిజన్ పరిధిలోని 13 మండలాల్లోని 13 జెడ్పీటీసీలు, 130 ఎంపీటీసీ స్థానాలకు ఎన్నికలు జరుగనున్నాయి.

❖ పంచాయతీ ఎన్నికలకు సంబంధించి మొదటి విడతలో బోధన్ రెవెన్యూ డివిజన్, నిజామాబాద్ రెవెన్యూ డివిజన్‌లోని 5 మండలాల పరిధిలోని 281 పంచాయతీలకు, 2,510 వార్డులకు ఎన్నికలు నిర్వహించనున్నారు. రెండో విడతలో ఆర్మూర్ రెవెన్యూ డివిజన్, నిజామాబాద్ రెవెన్యూ డివిజన్‌లోని 3 మండలాల పరిధిలోని 264 పంచాయతీలు, 2,512 వార్డులకు ఎన్నికలు జరుగనున్నాయి.

పరిషత్ ఎన్నికలు

మొదటి విడత పరిషత్ ఎన్నికలు..

బోధన్ డివిజన్..

క్రమ సంఖ్య	మండలం	ఎంపీటీసీ స్థానాలు
1	బోధన్	11
2	చందూరు	5
3	కోటగిరి	7
4	మోస్రా	5
5	పోతంగల్	8
6	రెంజల్	11
7	రుద్రూరు	6
8	సాలూరా	7
9	వర్ని	9
10	ఎడపల్లి	11

నిజామాబాద్ డివిజన్..

క్రమ సంఖ్య	మండలం	ఎంపీటీసీ స్థానాలు
11	ధర్పల్లి	11
12	డిచ్‌పల్లి	17
13	ఇందల్వాయి	11
14	మాక్లూర్	11
15	మోపాల్	11
16	నవీపేట	16
17	నిజామాబాద్	8
18	సిరికొండ	12
	మొత్తం	177

రెండో విడత పరిషత్..

ఆర్మూర్ డివిజన్..

క్రమ సంఖ్య	మండలం	ఎంపీటీసీ స్థానాలు
19	ఆలూరు	9
20	ఆర్మూర్	11
21	బాల్కొండ	9
22	భీమ్‌గల్	14
23	డొంకేశ్వర్	7
24	జక్రాన్‌పల్లి	13
25	కమ్మర్‌పల్లి	10
26	మెండోరా	8
27	మోర్తాడ్	10
28	ముప్కాల్	6
29	నందిపేట	15
30	వేల్పూర్	13
31	ఏర్గట్ల	5
	మొత్తం	130

పంచాయతీ ఎన్నికలు

మొదటి విడత పంచాయతీ ఎన్నికల వివరాలు

బోధన్ డివిజన్

క్రమ సంఖ్య	మండలం	జీపీలు
1	బోధన్	26
2	చందూరు	5
3	కోటగిరి	16
4	మోస్రా	5
5	పోతంగల్	20
6	రెంజల్	17
7	రుద్రూరు	11
8	సాలూరా	12
9	వర్ని	23
10	ఎడపల్లి	17

నిజామాబాద్ డివిజన్

క్రమ సంఖ్య	మండలం	జీపీలు
11	డిచ్‌పల్లి	34
12	ఇందల్వాయి	23
13	మోపాల్	21
14	నవీపేట	32
15	నిజామాబాద్	19
	మొత్తం	281

రెండో విడత పంచాయతీ ఎన్నికల వివరాలు

నిజామాబాద్ డివిజన్

క్రమ సంఖ్య	మండలం	జీపీలు
16	ధర్పల్లి	22
17	మాక్లూర్	26
18	సిరికొండ	30

ఆర్మూర్ డివిజన్

క్రమ సంఖ్య	మండలం	జీపీలు
19	ఆలూరు	11
20	ఆర్మూర్	14
21	బాల్కొండ	10
22	భీమ్‌గల్	27
23	డొంకేశ్వర్	13
24	జక్రాన్‌పల్లి	21
25	కమ్మర్‌పల్లి	14
26	మెండోరా	11
27	మోర్తాడ్	10
28	ముప్కాల్	7
29	నందిపేట	22
30	వేల్పూర్	18
31	ఏర్గట్ల	8
	మొత్తం	264
	జిల్లా మొత్తం	545

మత్స్య శాఖలో టెండర్ల వివాదం!

• అనుకూలంగా ఉన్నవారికి కట్టబెడుతున్నారని ఏడీపై ఆరోపణలు
• కలెక్టర్, అదనపు కలెక్టర్లకు కాంట్రాక్టర్ల ఫిర్యాదు
• వాయిదా పడిన టెండర్లు



డొంకేశ్వర్(ఆర్మూర్): జిల్లా మత్స్య శాఖలో చేపపిల్లల పంపిణీకి సంబంధించిన టెండర్లపై లొల్లి నడుస్తోంది. ఈ నెల 25న పూర్తి కావాల్సిన టెండర్లు తెరుచుకోకుండానే వాయిదా పడ్డాయి. మత్స్య శాఖ అధికారికి, కాంట్రాక్టర్లకు మధ్య తలెత్తిన వివాదమే ఇందుకు కారణమని తెలుస్తోంది. మత్స్య శాఖ ఏడీ తనకు అనుకూలంగా ఉన్న వారికే కాంట్రాక్టు కట్టబెట్టే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపిస్తూ ఇటీవల మిగతా కాంట్రాక్టర్లు కలెక్టర్, అదనపు కలెక్టర్లకు ఫిర్యాదు చేశారు. దీంతో నాలుగు రోజుల క్రితం అదనపు కలెక్టర్ చాంబర్‌లో జరుగుతున్న టెండర్లను రాత్రికి రాత్రే వాయిదా వేశారు. టెండర్లలో పాల్గొన్న కాంట్రాక్టర్లకు సంబంధించిన చెరువులను పునః పరిశీలించి నివేదిక ఇవ్వాలని కలెక్టర్ ఆదేశించినట్లు తెలిసింది. రీ ఎంక్వైరీకి ఏడీని కాకుండా మరో అధికారిని పంపాలని సూచించినట్లు సమాచారం.

చేపల చెరువుల పరిశీలనపై అనుమానాలు..

ఈ ఏడాది జిల్లాలోని 976 చెరువులను ఎంపిక చేసిన మత్స్యశాఖ అధికారులు 4.54 కోట్ల చేప పిల్లలు వదలాలని లక్ష్యంగా నిర్దేశించుకుని టెండర్లను ఆహ్వానించారు. ఈ–ప్రొక్యూర్‌మెంట్ విధానం ద్వారా టెండర్లు జరుగగా, ముగ్గురు బిడ్‌లు వేశారు. ఇందులో ఏపీకి చెందిన ఇద్దరు, కరీంనగర్‌కు చెందిన ఒకరు ఉన్నారు. వీరు చూపిన చేప పిల్లల పెంపకం కేంద్రాలను పరిశీలించడానికి కమిటీ వేయగా, ఇందులో మత్స్యశాఖ ఏడీ, పశుసంవర్ధక శాఖ అధికారి, రెవెన్యూ అధికారి, చీఫ్ ప్రమోటర్ ఉన్నారు. చీఫ్ ప్రమోటర్‌ను పక్కన పెట్టి నిబంధనలు పాటించకుండా దగ్గర సంబంధాలున్న అధికారులను వెంట తీసుకెళ్లినట్లుగా ఏడీపై ఆరోపణలు న్నాయి. పరిశీలన చేసి నివేదిక తయారు చేసిన అధికారులు ఏపీకి చెందిన ఇద్దరు కాంట్రాక్టర్లను టెండర్ల నుంచి రద్దు చేయడంతోనే ఈ వివాదం మొదలైందని ప్రచారం జరుగుతోంది. సక్రమంగా ఉన్న చేపల చెరువుల్లో లేని లోపాలు చూపారని, వేరే కాంట్రాక్టర్‌కు బినామీగా ఉండి చేప పిల్లల పంపిణీ కాంట్రాక్ట్‌ను పొందే ప్రయత్నం చేసినట్లుగా బాధిత కాంట్రాక్టర్లు ఏడీపై ఆరోపణలు చేస్తున్నారు. దీనిపై ఏడీ ఆంజనేయస్వామిని వివరణ కోరేందుకు ప్రయత్నించగా స్పందించలేదు. అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్‌ను సంప్రదించగా టెండర్లు వాయిదా పడ్డాయని, రీ ఎంక్వయిరీ చేయించనున్నట్లు తెలిపారు.

స్థానిక ఎన్నికలకు పకడ్బందీ ఏర్పాట్లు

• కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి

నిజామాబాద్‌అర్బన్: జిల్లాలో స్థానిక సంస్థల ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నామని కలెక్టర్ టి వినయ్ కృష్ణారెడ్డి అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలకు షెడ్యూల్ విడుదల చేసిన నేపథ్యంలో రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని సోమవారం సాయంత్రం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లపై సమీక్షించారు. కలెక్టర్‌తోపాటు సీపీ సాయిచైతన్య, అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్‌కుమార్ తదితరులు హాజరయ్యారు. ఎన్నికల నిర్వహణకు సన్నద్ధమై ఉన్నామని ఈ సందర్భంగా కలెక్టర్ కమిషనర్‌కు తెలిపారు. ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలతోపాటు గ్రామ పంచాయతీ ఎన్నికలను కూడా జిల్లాలో రెండు విడతల్లో నిర్వహించనున్నామన్నారు. మొత్తం 545 గ్రామ పంచాయతీలకు గాను తొలి విడతలో 281, రెండో విడతలో 264 జీపీల్లో ఎన్నికలు నిర్వహించేలా ప్రణాళికలు రూపొందించామని కలెక్టర్ తెలిపారు. ఎన్నికల నిర్వహణ సిబ్బందిని నియమిస్తూ, వారికి మలివిడత శిక్షణ కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు.ఎలక్షన్ కోడ్ పకడ్బందీగా అమలు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు.

వీసీ అనంతరం నోడల్ అధికారులతో కలెక్టర్ సమావేశమయ్యారు. ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలను పాటిస్తూ స్థానిక ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో పకడ్బందీగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ఏవైనా సందేహాలు ఉంటే పైస్థాయి అధికారులను సంప్రదించి ముందుగానే నివృత్తి చేసుకోవాలన్నారు. డీఆర్డీవో సాయాగౌడ్, డీపీవో శ్రీనివాస్‌రావు, నోడల్ అధికారులు పాల్గొన్నారు.



వీసీలో పాల్గొన్న కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి, సీపీ సాయిచైతన్య

ఆదుకోండి సారూ..



మాక్లూర్ మండలం చిన్నాపూర్ గ్రామానికి చెందిన సింధూజ అనే యువతికి నాలుగు సంవత్సరాల క్రితం రుమటాయిడ్ ఆర్థరైటిస్‌తో కాళ్ల వేళ్లు, చేతివేళ్లు పూర్తిగా ఊడిపోయాయి. నాన్న వ్యవసాయ కూలీ పనిచేస్తాడని, ప్రతి నెల నిమ్స్‌లో చూపించుకోడానికి మందులు, ఇతర ఖర్చులకు రూ.10 వేల వరకు అవుతోందని తెలిపింది. తల్లిదండ్రులకు అంత స్తోమత లేదని తనకు పింఛన్ ఇప్పించాలని, ఏదైన ఆర్థిక సహాయం అందించాలని సోమవారం జిల్లా కలెక్టరేట్‌కు తల్లితో వచ్చి ప్రజావాణిలో కలెక్టర్‌కు వినతిపత్రం అందజేసింది. ఎవరైనా దాతలు తనను ఆదుకోవాలని వేడుకొన్నది. – సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నిజామాబాద్

చెరువులకు జలకళ

• నిండిన 90శాతానికి పైగా చెరువులు
• రెండు పంటలకు ఢోకా లేనట్టే..
• బాల్కొండ డివిజన్‌లో భిన్న పరిస్థితి

నిజామాబాద్‌నాగారం: భారీ వర్షాలు కురవడంతో జిల్లాలోని చెరువులు జలకళను సంతరించుకున్నాయి. ఇప్పటికీ వాగులు పొంగిపొర్లుతున్నాయి. చెరువుల్లో పుష్కలంగా నీరుండడంతో రెండు పంటలకు ఢోకా లేనట్టేనని రైతులు అంటున్నారు. చెరువుల్లోని నీటిని విడుదల చేయాల్సిన అవసరం లేకుండానే ఖరీఫ్ పంటలు పండుతున్నాయి. కొన్ని ప్రాంతాల్లో పంట కోతకు రాగా, మరికొన్ని కొన్ని ప్రాంతాల్లో పొట్టదశలో ఉంది. అయితే బాల్కొండ డివిజన్‌లో మాత్రం భిన్న పరిస్థితి ఉంది. మొత్తం 292 చెరువులు ఉండగా, 174 చెరువులు 10 శాతం, 77 చెరువులు 75 శాతం లోపు నిండాయి. 41 చెరువులు పొంగిపోర్లుతున్నాయి. బాల్కొండ ప్రాంతంలో వర్షాలు తక్కువగా కురిశాయి.

జిల్లాలోని చెరువుల్లో నీటి నిల్వ ఇలా..

డివిజన్	చెరువులు	75శాతం	100శాతం	మత్తడి
బోధన్	182	02	68	112
నిజామాబాద్	324	30	213	81
ఆర్మూర్	198	15	77	106
బాల్కొండ	292	77	174	41
బాన్సువాడ (ఆరు మండలాలు)	90	01	72	17
మొత్తం	1086	125	604	357

క్లుప్తంగా

ఆరోపణలు అవాస్తవం

- జిల్లా జైలు సూపరింటెండెంట్ చింతల దశరథం

ఖలీల్‌వాడి: తనపై వచ్చిన ఆరోపణలు అవాస్తవమని, ఎవరో అనవసరంగా దుష్ప్రచారం చేస్తున్నారని జిల్లా జైలు సూపరింటెండెంట్ చింతల దశరథం 'సాక్షి'కి ఫోన్ ద్వారా సోమవారం తెలిపారు. విధుల్లో భాగంగా వివిధ అంశాలపై అందరి సమక్షంలో మాట్లాడుతామని, తనపై అనవసరంగా సోషల్ మీడియాలో ప్రచారం చేయడం సబబుకాదన్నారు. తనపై ఎలాంటి జుడీషియల్ విచారణ జరగడం లేదన్నారు. తప్పుడు ప్రచారం మానుకోవాలన్నారు. మరోవైపు, ఇదే అంశంపై కామారెడ్డి జైలులోని జూనియర్ అసిస్టెంట్ ముందుకొచ్చి నిజామాబాద్ జైలు సూపరింటెండెంట్‌పై వస్తున్న ఆరోపణలన్నీ అవాస్తవమని వివరణ ఇచ్చారు. ఆరోపణలకు తనకు ఎలాంటి సంబంధం లేదని సదరు జూనియర్ అసిస్టెంట్ కామారెడ్డి సబ్ జైలు పర్యవేక్షణ అధికారికి ఉత్తరం అందించారు.

కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

- మార్క్‌ఫెడ్ చైర్మన్ మార గంగారెడ్డి



పెర్కిట్(ఆర్మూర్): ప్రభుత్వం ద్వారా ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని మార్క్‌ఫెడ్ చైర్మన్ మార గంగారెడ్డి పేర్కొన్నారు. ఆర్మూర్ మండలం అంకాపూర్ గ్రామంలో సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాన్ని సోమవారం మార గంగారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాల్లో క్వింటాలు 'ఏ' గ్రేడు ధాన్యానికి రూ.2,389, 'బీ' గ్రేడు ధాన్యానికి రూ.2,369 మద్దతు ధర అందజేస్తున్నట్లు తెలిపారు. రైతులు మధ్య దళారులను నమ్మి మోసపోవద్దన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ శాఖ అధికారి హరికృష్ణ, ఏఈవో సవిత, సీఈవో శ్యాం, డైరెక్టర్లు ఆలూర్ నారాయణ రెడ్డి, పుప్పాల ప్రవీణ్, నరేడ్ల గంగారాం, చిట్టిడి చిన్నయ్య, కుంట గంగారెడ్డి, మురళి, క్లోం నర్సారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పదేళ్ల తర్వాత..

- అసిస్టెంట్ ఆడిట్ ఆఫీసర్ పోస్టు భర్తీ
- బాధ్యతలు స్వీకరించిన ఆనంద్ కుమార్



నిజామాబాద్‌నాగారం: జిల్లాలో ఖాళీగా ఉన్న అసిస్టెంట్ ఆడిట్ ఆఫీసర్ పోస్టు పది సంవత్సరాల తర్వాత ఎట్టకేలకు భర్తీ అయ్యింది. ఇటీవల విడుదల చేసిన గ్రూప్–1 ఫలితాల్లో జిల్లాకు చెందిన ఆనంద్ అసిస్టెంట్ ఆడిట్ ఆఫీసర్‌గా ఎంపికైన విషయం తెలిసిందే. సీఎం చేతుల మీదుగా శనివారం నియామకపత్రం అందుకున్న ఆయన.. సోమవారం కలెక్టరేట్ సముదాయంలోని ఆడిట్ కార్యాలయంలో జిల్లా అధికారి విజయ్ కుమార్‌కు జాయినింగ్ రిపోర్టు అందజేశారు. గ్రూప్–1 అధికారిగా ఆనంద్‌కుమార్ విధుల్లో చేరడంతో గెజిటెడ్ ఉద్యోగుల సంఘం నాయకులు అమృత్‌కుమార్, దండు స్వామి, రమణరెడ్డి, రంగరత్నం, అరుణాచలం, ఏడీఈ అశోక్ అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ఆనంద్ సతీమణి తేజస్విని, తల్లిదండ్రులు కరుణ, ఆనంద్, సన్నిహితులు నాయుడు రాజు, అందె నవీన్ కుమార్, దేవ శ్రావణి పాల్గొన్నారు.

గంగమ్మ ఒడికి గౌరమ్మ..



వినాయక్‌నగర్‌లో బతుకమ్మను పేర్చుతున్న మహిళలు

బోర్గాం(పి)లో బతుకమ్మతో చిన్నారి



బోర్గాం(పి)లో బతుకమ్మలతో తరలివస్తున్న యువతులు, మహిళలు



బతుకమ్మతో సెల్ఫీ తీసుకుంటున్న యువతి





జిల్లా కేంద్రంలో సోమవారం సద్దుల బతుకమ్మ ఉత్సవాలు వైభవంగా నిర్వహించారు. బోర్గాం(పి), నాందేవ్‌వాడ, రఘునాథ చెరువు, దుబ్బ ప్రాంతాల్లో బతుకమ్మ ఆడారు. రంగురంగుల పూలతో పేర్చిన బతుకమ్మలతో మహిళలు పెద్ద సంఖ్యలో తరలిరావడంతో సందడి నెలకొంది. ప్రధాన కూడళ్ల వద్ద మహిళలు బతుకమ్మ ఆడిపాడారు. చెరువులు, సమీపంలో ఏర్పాటు చేసిన నీటి కుండీల్లో బతుకమ్మలను వదిలారు. అనంతరం వెంట తెచ్చుకున్న పిండి వంటలను ఒకరికొకరు తినిపించారు.



బోర్గాం(పి)లోని హనుమాన్ ఆలయం వద్ద బతుకమ్మ ఆడుతున్న మహిళలు



బోర్గాం(పి)లో బతుకమ్మ ఆడేందుకు తరలివచ్చిన మహిళలతో సందడి వాతావరణం



ఖిల్లా రఘునాథ చెరువు వద్ద బతుకమ్మ ఆడుతున్న మహిళలు, చిన్నారులు



బోర్గాం(పి)లో బతుకమ్మ ఆడుతున్న మహిళలు

భూ భారతి దరఖాస్తులను వేగంగా పరిష్కరించాలి

- అధికారులకు కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి ఆదేశం
- ఎడపల్లి తహసీల్, ఎంపీడీవో కార్యాలయాల తనిఖీ



ఎడపల్లి తహసీల్ కార్యాలయంలో అధికారులు, ఉద్యోగులతో మాట్లాడుతున్న కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి

బోధన్: భూ భారతి (రెవెన్యూ) సదస్సుల్లో స్వీకరించిన దరఖాస్తులను వేగవంతంగా పరిష్కరించేందుకు చిత్తశుద్ధితో కృషి చేయాలని కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి అధికారులను ఆదేశించారు. రెవెన్యూ దరఖాస్తుల పరిష్కారానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. దరఖాస్తుల పరిష్కారంలో జాప్యం జరుగకుండా రోజువారీగా పర్యవేక్షించాలని తెలిపారు. ఎడపల్లి తహసీల్, ఎంపీడీవో కార్యాలయాలను సోమవారం ఆయన ఆకస్మికంగా సందర్శించారు. రెవెన్యూ దరఖాస్తులకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. తహసీల్దార్ దత్తాద్రి, ఉద్యోగులతో సమావేశమై దరఖాస్తులపై గ్రామాల వారీగా సమీక్షించారు. ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాల ప్రకారం సాదాబైనామా దరఖాస్తులను పరిష్కరించాలని పేర్కొన్నారు. ఓటర్ల స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియ చేపడుతున్న తీరును పరిశీలించి పలు సూచనలు చేశారు. గడువులోపు ఎస్ఐఆర్‌ను పూర్తి చేయాలని కలెక్టర్ అధికారులకు ఆదేశించారు. అంతకుముందు ఎంపీడీవో ఆఫీస్‌ను సందర్శించి అధికారులు, ఉద్యోగులతో మండలంలోని కొనసాగుతున్న అభివృద్ధి పనులపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల ప్రగతిపై ఆరా తీశారు. లబ్ధిదారులందరూ ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించి త్వరితగతిన పూర్తి చేసుకునేలా ప్రోత్సహించాలన్నారు. ఇప్పటికే పూర్తయిన ఇందిరమ్మ ఇళ్ల ప్రారంభోత్సవాలకు సిద్ధం చేయాలని కలెక్టర్ సూచించారు.

ప్రజావాణికి 40 ఫిర్యాదులు



ప్రజావాణిలో ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి

నిజామాబాద్‌అర్బన్: ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి అధికారులకు సూచించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి 40 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు తమ సమస్యలను కలెక్టర్‌తోపాటు అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్ కుమార్, ట్రెయినీ కలెక్టర్ కరోలిన్ చింగ్తియాన్ మావీ, నగరపాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్, ఏసీపీ రాజావెంకట్ రెడ్డిలకు విన్నవించారు. కాగా, ఫిర్యాదులను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ పరిష్కరించాలని కలెక్టర్ సూచించారు.

ఎస్సైకి సన్మానం

కలెక్టరేట్‌లో విధులు నిర్వర్తిస్తూ ఈ నెల 30న పదవీ విరమణ చేస్తున్న ఎస్సై ఎండీ నసీరుద్దీన్‌ను ఘనంగా సన్మానించారు. కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి పూల మాలలు, శాలువాతో సత్కరించి జ్ఞాపికను బహూకరించారు. నసీరుద్దీన్ అందించిన సేవలను కొనియాడారు.

ఆర్మూర్ కళాకారులకు అవార్డుల పంట



మలేషియాలో అవార్డులను పొందిన నటరాజ నృత్యనికేతన్ చిన్నారులు

ఆర్మూర్: మలేషియా దేశంలోని కౌలాలంపూర్‌లో ఆదివారం రాత్రి నిర్వహించిన బతుకమ్మ, దసరా సంబురాల్లో ఆర్మూర్ పట్టణంలోని నటరాజ నృత్య నికేతన్‌లో శిక్షణ పొందిన చిన్నారులు కూచిపూడి, ఆంధ్ర నాట్యం ప్రదర్శనలతో అవార్డులను కైవసం చేసుకున్నట్లు నిర్వాహకులు సోమవారం తెలిపారు. యునైటెడ్ హెరిటేజ్ ఆర్ట్స్‌అండ్ కల్చర్ ఆర్గనైజేషన్ వారు నిర్వహించిన ఈ వేడుకల్లో నాట్య గురువు డాక్టర్ బాశెట్టి మృణాళినితోపాటు 20 మంది చిన్నారుల ప్రదర్శనకు మెచ్చిన నిర్వాహకులు ఫ్యూచర్ ఐకాన్ ఆఫ్ డ్యాన్స్ ఇంటర్నేషనల్ ఎక్సెలెన్స్ అవార్డులను ప్రదానం చేశారు.

చిన్నారులను ఉన్నతంగా తీర్చిదిద్దుతున్న మృణాళిని విశిష్ట అతిథిగా కార్యక్రమానికి ఆహ్వానించి అవార్డును అందజేసి సన్మానించారు. గురువుతోపాటు చిన్నారులు అవార్డులను కైవసం చేసుకోవడంపై నటరాజ నృత్యనికేతన్ వ్యవస్థాపకులు మాడవేడి నారాయణ, చిన్నారుల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు.

నిలకడగా గోదారి.. నీటిలోనే పంటలు



తాడ్‌బిలోలి శివారులో నీటమునిగిన వరి

రెంజల్(బోధన్): ఉగ్ర గోదావరి నిలకడగా మారింది. ఎగువన మహారాష్ట్ర నుంచి భారీ వరద వస్తుండగా, స్థానికంగా మంజీర నది నుంచి వరద ఉధృతి తగ్గుతోంది. దీంతో గోదావరి నది పరీవాహక గ్రామాల్లో వేసిన పంటలు నీటిలోనే ఉన్నాయి. మూడు రోజులుగా వరద నీరు వదలక పోవడంతో పంటలు పూర్తిగా దెబ్బతింటాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని తాడ్‌బిలోలి–బోర్గాం గ్రామాల మధ్య నిర్మించిన జాతీయ రహదారికి ఇరువైపులా పంట పొలాలు 15 ఫీట్ల లోతులో మునిగి ఉన్నాయి.

నిలిచిన రాకపోకలు

తాడ్‌బిలోలి–బోర్గాం గ్రామాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. గోదావరి బ్యాక్‌వాటర్‌తో రెండు గ్రామాల మధ్య ఉన్న వంతెనకు ఇరువైపులా రోడ్డుపై వరద నీరు నిలిచిపోయింది. నిజామాబాద్ నుంచి వచ్చే ఆర్టీసీ బస్సులను సాటాపూర్ నుంచి జాతీయ రహదారి మీదుగా గ్రామానికి నడుపుతున్నారు.



తాడ్‌బిలోలి-బోర్గాం గ్రామాల మధ్య రోడ్డుపై నిలిచిన వరద నీరు

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ధ్వంసం



మోపాల్: మండలంలోని న్యాల్‌కల్ శివారులో ఉన్న పొలంలో నాలుగు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను గుర్తు తెలియని దుండగులు ఆదివారం రాత్రి ధ్వంసం చేశారు. ఎస్సై సుష్మిత తెలిపిన వివరాల ప్రకారం.. న్యాల్‌కల్ శివారులోని రెండు 25 కేవీ, మరో రెండు 16 కేవీ ట్రాన్స్‌ఫార్మర్లు ధ్వంసమయ్యాయి. సోమవారం ఉదయం గమనించిన రైతులు విద్యుత్ శాఖ ఏఈ నాగశైర్వానీ, లైన్‌మన్ మనోహర్‌కు సమాచా రం అందించారు. ఘటనా స్థలాన్ని పరిశీలించి, పంచనామా నిర్వహించారు. పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నారు.

క్రైం కార్నర్

హత్యాయత్నం కేసులో ఒకరికి ఐదేళ్ల జైలు

నిజామాబాద్ లీగల్: హత్యాయత్నం కేసులో ఒకరికి నిజామాబాద్ అడిషనల్ సెషన్స్ కోర్టు జడ్జి సాయి సుధా ఐదు సంవత్సరాల జైలు శిక్ష, రూ.500 జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు. ఆదిలాబాద్ జిల్లా భైంసాపూర్‌కు చెందిన షకీల్ తాగుడుకు బానిసై నిజామాబాద్ రైల్వేస్టేషన్ పరిసరాల్లో సంచరించేవాడు. 18 అక్టోబర్ 2021న నిజామాబాద్ రైల్వేస్టేషన్ సమీపంలో ఉన్న ఎస్ఎల్ఎస్ వైన్స్ వద్ద మద్యం తాగి గొడవచేస్తుండగా, షేక్ జలీల్ అనే వ్యక్తి గొడవ చేయొద్దంటూ షకీల్‌ను బెదిరించాడు. దీనిని మనస్సులో పెట్టుకున్న షకీల్, జలీల్‌పై దాడిచేయాలని నిర్ణయించుకొని తర్వాతి రోజు కత్తితో వైన్స్ వద్దకు వచ్చాడు. రెండో రోజు సైతం జలీల్ బెదిరించడంతో షకీల్ అతనిపై కత్తితో దాడిచేసి, కడుపులో పొడిచి తీవ్రంగా గాయపరిచాడు. వైన్స్‌లో పనిచేస్తున్న రమేశ్, సర్ఫరోజ్ ఖాన్ ఇద్దరినీ విడిపించి, జలీల్‌ను నిజామాబాద్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వన్ టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి షకీల్‌ను జైలుకు పంపారు. ఈ కేసులో పోలీసుల తరఫున డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ లక్ష్మినర్సయ్య వాదించారు. సాక్ష్యాధారాలను పరిశీలించిన న్యాయమూర్తి నిందితునికి ఐదు సంవత్సరాల జైలు శిక్ష, రూ.500 జరిమానా విధించారు.

పోక్సో కేసు నమోదు

వర్ని: వర్ని పోలీస్ స్టేషన్ పరిధిలో ఒకరిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు ఎస్సై మహేశ్ సోమవారం తెలిపారు. చందూర్ మండలంలో ఆరేళ్ల బాలికపై వృద్ధుడు అఘాయిత్యానికి పాల్పడటంతో కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు.

ఇసుక లారీ పట్టివేత



వేల్పూర్: వేల్పూర్ క్రాస్‌రోడ్డు వద్ద 63 నెంబర్ జాతీయ రహదారిపై అక్రమంగా ఇసుక తరలిస్తున్న లారీని సోమవారం పట్టుకున్నట్లు ఎస్సై సంజీవ్ తెలిపారు. క్రాస్‌రోడ్డు వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా కోరుట్ల నుంచి వచ్చిన ఇసుక లారీకి ఎలాంటి అనుమతులు లేకపోవడంతో స్వాధీనం చేసుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు వెల్లడించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

అమ్రాబాద్ శివారులో చిరుత సంచారం

- లేగ దూడపై దాడితో ఆలస్యంగా వెలుగులోకి..



పంచనామా నిర్వహిస్తున్న సెక్షన్ ఆఫీసర్

మోపాల్(నిజామాబాద్‌రూరల్): మండలంలోని అమ్రాబాద్ శివారులోగల గుండ్యానాయక్ తండా అటవీ ప్రాంతంలో చిరుత సంచరిస్తున్నట్లు ఫారెస్ట్ అధికారులు సోమవారం తెలిపారు. రెండ్రోజుల క్రితం 9 నెలల లేగ దూడపై దాడి చేసి ఎత్తుకెళ్లగా, కళేబరం గుర్తించడంతో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. మెగావత్ రమేశ్ ప్రతిరోజూ 60 ఆవుల మందను మేత కోసం అటవీ ప్రాంతంలోకి తోలుకెళ్తాడు. మూడు రోజుల క్రితం ఆవుల మందలోని 9 నెలల లేగ దూడ కన్పించలేదు. సోమవారం కూడా ఆవుల మందను మేత కోసం తీసుకెళ్లగా, చిరుత ఆవుపై దాడికి యత్నించింది. గమనించిన రమేశ్ అరుపులు వేయడంతో అడవిలోకి వెళ్లిపోయింది. దాడిలో ఆవుకు స్వల్పంగా గాయమైంది. లేగ దూడపై కూడా చిరుత దాడి చేసిందని నిర్ధారణకు వచ్చిన రమేశ్.. దాని కోసం వెతకగా బండరాళ్ల మధ్య కళేబరం కన్పించింది. వెంటనే ఫారెస్ట్ అధికారులకు సమాచారమివ్వగా, వారు ఘటనా స్థలానికి చేరుకొని పంచనామా నిర్వహించారు. చిరుత సంచరిస్తున్నట్లు సెక్షన్ ఆఫీసర్ సాయికుమార్, బీట్ ఆఫీసర్ సురేశ్‌కుమార్, వాచర్లు రవి, బీమా గుర్తించారు. ప్రజలు, గిరిజనులు అప్రమత్తంగా ఉండాలని, ఒంటరిగా అటవీ ప్రాంతంలోకి వెళ్లొద్దని సూచించారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని పేర్కొన్నారు.

ఆ మూడు మద్యం దుకాణాలకే తీవ్ర పోటీ!

- గత మద్యం పాలసీలో జిల్లాలోని మానిక్‌భండార్, మోపాల్, ఏర్గట్ల షాపులకు వందల్లో దరఖాస్తులు
- ఆయా దుకాణాల పరిధిలో గ్రామాలు ఎక్కువగా ఉండటమే కారణం

మోర్తాడ్(బాల్కొండ): రాష్ట్ర ప్రభుత్వం 2025–27 నూతన మద్యం పాలసీని అమలులోకి తెచ్చింది. ఈ నేపథ్యంలో దరఖాస్తుల స్వీకరణకు శ్రీకారం చుట్టింది. ఈసారి కూడా గతంలో మాదిరిగానే మానిక్‌భండార్, మోపాల్, ఏర్గట్ల వైన్స్‌లను దక్కించుకోవడానికి వ్యాపారులు అధిక మొత్తంలో పోటీ పడుతారనే భావన ఎక్సైజ్ అధికారులలో వ్యక్తమవుతుంది. అందుకే అందరి చూపు ఆ మద్యం దుకాణాలపైనే నిలచి ఉంది.

రూ.6.50 కోట్ల ఆదాయం..

జిల్లాలో 2023–25 మద్యం పాలసీలో భాగంగా 102 వైన్స్‌లకు నాలుగువేల దరఖాస్తులు అందాయి. దరఖాస్తుల ద్వారా రాష్ట్ర ప్రభుత్వానికి రూ.80 కోట్ల ఆదాయం లభించింది. అందులో రూ.6.52 కోట్ల ఆదాయం కేవలం మానిక్‌భండార్, మోపాల్, ఏర్గట్ల వైన్స్‌లకు వచ్చిన దరఖాస్తుల ఫీజుతోనే లభించడం విశేషం. మానిక్‌భండార్ వైన్స్‌కు 112 దరఖాస్తులతో రూ.2.24 కోట్లు, మోపాల్ మద్యం దుకాణానికి 110 దరఖాస్తుల ద్వారా రూ.2.20 కోట్లు, ఏర్గట్ల వైన్స్‌కు 104 దరఖాస్తుల ద్వారా రూ.2.08 కోట్ల ఆదాయం వచ్చింది. ఆయా మద్యం దుకాణాల్లో రోజుకు రూ.2.50లక్షల నుంచి రూ.4.50 లక్షల వరకు లిక్కర్ విక్రయం అవుతుంది. ఈ మద్యం దుకాణాల పరిధిలో గ్రామాలు ఎక్కువగా ఉండటమే అందుకు కారణం అని అధికారులు చెబుతున్నారు.